

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	200	220
సూర్యాపేట	రూ.105	170	200
నల్లగొండ	రూ.110	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 22.4

రూ.600 కోట్లతో గంధమల్ల పూర్తి చేస్తాం

- లక్షన్నర ఎకరాలకు సాగునీరందిస్తాం
- సన్న బియ్యం పంపిణీ దేశ చరిత్రలో నిలుస్తుంది
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రూ.600కోట్లతో గంధమల్ల రిజర్వాయర్‌ను నెల రోజుల్లో పూర్తిచేసి, లక్షన్నర ఎకరాలకు సాగునీరందిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం యాదగిరిగుట్టలో సన్నబియ్యం పంపిణీలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆలేరు ఎడారిగా మారిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కలిసి ప్రజాశ్రేయస్సుకు కృషి చేస్తున్నారని, 15 నెలల్లోనే 20లక్షల రేషన్‌కార్డులు ఇచ్చామని, దేశంలో సన్నబియ్యం ఇప్పటివరకు ఏ రాష్ట్రం ఇవ్వలేదని, తెలంగాణ రాష్ట్రమే ఆదర్శమన్నారు. నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతీ, యువకులకు రాజీవ్ యువ వికాసంతో రూ. 5లక్షల వరకు సబ్సిడీతో బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తామని, వాటిని వినియోగించుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలన్నారు.



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాష్ట్రంలో 84 శాతం మందికి సన్నబియ్యం అందించనున్నామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అంచలవారీగా అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల 11న ఆలేరు బీసీ డిక్లరేషన్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని పెద్దఎత్తున మహిళలు, అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం గొప్ప కార్యక్రమమన్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ సన్నబియ్యం అందుకోబోతున్న ప్రతీ పేద కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. అనంతరం నియోజకవర్గంలో ప్రతిమండలానికి నలుగురి చొప్పున సన్నబియ్యం అందజేశారు. మహిళ సంఘాలకు రూ.23కోట్ల చెక్కును అంజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆలేరు, మోత్కూర్ మార్కెట్ కమిటీల చైర్మన్లు ఐనాల చైతన్యమహేందర్‌రెడ్డి, నూనెముంతల విజయ, డీపీవో సత్యనారాయణ, డీఆర్‌డీఏ నాగిరెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసీల్దార్ దేశ్యనాయక్, నాయకులు నీలం పద్మ, నీలం వెంకటస్వామి, కానుగు బాలరాజ్‌గౌడ్, చీర శ్రీశైలం, దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్‌గౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, బంగారపు భిక్షపతిగౌడ్, గుడ్ల వరలక్ష్మీ, సుడుగు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీవల్లి అధికారులు పాల్గొన్నారు.

అన్నంలో ప్రభుత్వాన్ని చూసుకోవాలి : కలెక్టర్

భువనగిరి టౌన్: దొడ్డు బియ్యంతో ఆకలికి అలమటించిన పేదలు ఇకనుంచి సన్నబియ్యం అన్నంలో ప్రభుత్వాన్ని చూసుకుంటూ కడుపు నింపుకోవాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం భువనగిరిలో సన్నబియ్యం పంపిణీ ఆయన ప్రారంభించి మాట్లాడారు. సన్నబియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరికీ గూడు కల్పించే ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో దశలవారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు లభిస్తాయని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతూ ప్రజల కడుపు నింపేందుకే ప్రభుత్వం కిలోకి రూ.40 ఖర్చుతో సన్నబియ్యం అందిస్తున్నదని, ఇందుకు ప్రతి ఏటా సుమారు రూ.11వేల కోట్లు వెచ్చిస్తుందన్నారు.

ప్రారంభోత్సవంలో వివాదం

భువనగిరి టౌన్: భువనగిరిలో సన్నబియ్యం ప్రారంభోత్సవంలో వివాదం నెలకొన్నది. ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రారంభించిన వెంటనే నిధులు కేంద్రానివి, సోకులు రాష్ట్రానివా అంటూ బీజేపీ నాయకులు నినాదాలు చేశారు. ఫ్లెక్సీలో ప్రధాని మోదీ ఫొటోను ఎందుకు ముద్రించలేదంటూ ఎమ్మెల్యే అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తల ప్రతినినాదాలు, ఆందోళనకారులను అడ్డుకునేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలతో ఉద్రిక్తత నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటూ కార్యక్రమానికి అడ్డుపడితే సహించబోమంటూ హెచ్చరించారు.

కొరవడిన తులసీ కాటేజీ భద్రత

- సీసీ కెమెరాలు..ప్రహరీలేని అద్దె గదులు
- వీటిలో గ్రీజర్లు.. ఫిర్యాదుల పుస్తకం లేని వైనం
- కనీసం డార్మెంటరీ హాల్‌లేని దైన్యం
- సదుపాయాల కల్పనలో ఇన్నేళ్లుగా అధికారుల నిర్లక్ష్యం



భక్తులు కూర్చునేందుకు ఎలాంటి సౌకర్యాలు లేని అద్దె భవనాలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆధ్యాత్మిక క్షేత్రానికి భద్రత విషయంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.1200 కోట్లతో నిర్మించిన ఆలయానికి భద్రత కొరవడినట్లు కన్పిస్తోంది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తుల నుంచి పలు రకాల ఆదాయ మార్గాలను అన్వేషించి టికెట్టు రూపంలో ముక్కుపిండే అధికారులు వారికి కావాల్సిన రక్షణ, భద్రత, మౌళిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. భక్తుల అద్దె గదులు గల తులసీ కాటేజీ ఏకైక అవకాశంగా ఉన్నా, అవగాహన లోపమో, విధుల్లో నిర్లక్ష్యమో గానీ...ఇక్కడ భద్రత, వసతులు కల్పించేందుకు ఆలయ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత కొండపైన సుమారు 100 మంది నిద్రించేందుకు డార్మెటరీ హాల్ మాత్రమే ఉంది. ఎంతో ప్రాధాన్యంగల కాటేజీలో ఏఈవో, పర్యవేక్షకుడు, గుమస్తా స్థాయి అధికారులు ఇన్నేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తూ అవగాహన లోపంతో భద్రత, మౌళిక వసతుల కల్పనకు కనీసం ప్రతిపాదనలు చేయకపోవడం వీరి నిర్లక్ష్యానికి అద్దం

- మిగతా 8వ పేజీలో...

నిధుల వరద

భువనగిరి నియోజకవర్గం లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో నియోజకవర్గంలోని భువనగిరి, భూదాన్‌పోచంపల్లి మునిసిపాలిటీలతోపాటు భువనగిరి, పోచంపల్లి, బీబీనగర్ మండలాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



- భువనగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.56.18కోట్లు
- హెచ్‌ఎండీఏ ద్వారా నిధులు మంజూరు
- భువనగిరి, బీబీనగర్, భూదాన్ పోచంపల్లి మండలాల్లో
- సీసీ, బీటీ, అండర్‌గ్రౌండ్ పనులకు కేటాయింపు

భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాలు హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) పరిధిలో ఉంటాయి. అయితే ఈ ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొత్త లేఅవుట్లు, వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తుంటారు. హెచ్‌ఎండీఏ సాంకేతిక అనుమతి తప్పనిసరిగా అవసరం ఉండటంతో ఎల్‌ఆర్‌ఎస్‌తోపాటు పలు రకాల ఫీజులు వసూలు చేస్తుంది. అయితే స్థానికంగా ఉన్న గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మునిసిపల్ శాఖ మంత్రితోపాటు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం హెచ్‌ఎండీఏ ద్వారా నియోజకవర్గానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ మేరకు ఆయా మునిసిపాలిటీల్లో చేపట్టాల్సిన పనుల కోసం అంచనాలు రూపొందించి హెచ్‌ఎండీఏకు నివేదించారు. ప్రభుత్వం ఎమ్మెల్యే వినతి మేరకు హెచ్‌ఎండీఏ నుంచి రూ.56.18కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ నిధులతో వీటిని చేపట్టడంతోపాటు నూతనంగా మౌలిక వసతుల కల్పన అంచనాలు రూపొందించారు. ప్రధానంగా సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించనున్నారు. ఈ నిధుల్లోనుంచి రూ.5.80కోట్లతో భువనగిరి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఫుట్‌పాత్ పనులు, రూ.7.80 కోట్లతో పట్టణంలోని పలు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. భువనగిరి మండలంలోని పలు గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు రూ.9.50కోట్లు కేటాయించారు. భూదాన్‌పోచంపల్లి మునిసిపాలిటీ పరిధిలో రూ.7.90కోట్లతో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడతారు. భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న పనులకు రూ.9.10కోట్లు కేటాయించారు. బీబీనగర్ మండలాల్లోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు రూ.16.08కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరు కావడంతో పనులు చేపట్టేందుకు ఆయా శాఖలు సన్నద్ధమవుతున్నాయి. భువనగిరి మునిసిపాలిటీ ఏర్పాటై చాలా ఏళ్లు గడుస్తున్నా, ప్రజలకు మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో భువనగిరి జిల్లా కేంద్రం కూడా కావడంతో అన్ని హంగులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మునిసిపాలిటీల్లోని అన్ని వార్డుల్లోనూ కలియ తిరుగుతూ... అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. ఈ మేరకు అధికారులతో సమీక్షలు నిర్వహించి, అభివృద్ధి పనులపై నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు

భువనగిరి నియోజకవర్గంలో పలుఅభివృద్ధి పనులు చేపట్టేందుకు హెచ్‌ఎండీఏ రూ.56.18కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి మండలాల్లో మునిసిపాలిటీల్లో, గ్రామాల్లో సీసీ, బీటీ, అండర్‌గ్రౌండ్‌తో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నాం. గతంలో ఎన్నడూ లేనివిధంగా హెచ్‌ఎండీఏ పెద్దఎత్తున నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించింది. నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణతో నిధుల మంజూరు సాధ్యమైంది.మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చించి అర్బన్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని ప్రధాన రహదారిని మూడు కిలోమీటర్ల మేరకు విస్తరించారు. అయితే ప్రభుత్వం మారిపోవడంతో పలు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వీటికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ టవర్ల పనులకు..

- మిగతా 8వ పేజీలో...

ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం రూ.5.72కోట్లు

- 2,598 మంది ఫీజు చెల్లింపు



చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 2,598 మంది ప్లాట్ల యజమానులు రూ.5.72కోట్ల ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించారు. మార్చి 31వ తేదీ సాయంత్రం 4 గంటలవరకు జరిగిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో 2,598 మంది ప్లాట్ల యజమానులు ఫీజు చెల్లించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు 2020లో 16,571 మంది రూ.1000చెల్లించి దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 13,452 మంది దరఖాస్తుదారులకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందులో కేవలం 2,598 మంది దరఖాస్తుదారులు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించారు. 3,119 మంది దరఖాస్తుదారులకు రకరకాల కారణాలను చూపి ఫీజు చెల్లించే ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో దరఖాస్తుదారులు లబోదిబోమంటున్నారు. మునిసిపల్ అధికారులు చూపించే శ్రద్ధ ఇతర శాఖల అధికారులకు లేకపోవడంతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులో దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. రూ.1000 దరఖాస్తు ఫీజు చెల్లించిన ప్రతీఒక్కరికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించే అవకాశం కల్పించాలని, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించే అవకాశాన్ని ఈనెల 30వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని పలువురు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని మునిసిపల్ కమిషనర్ కె.నర్సింహారెడ్డి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి ప్లాట్ల యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు.

హెచ్‌సీయూ భూముల వేలం సరికాదు

సీపీఎం రాష్ట్ర కమిటీసభ్యుడు కొండమడుగు నర్సింహ



భువనగిరి రూరల్ పీఎస్‌లో మాట్లాడుతున్న నర్సింహ

భువనగిరి రూరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400ఎకరాల భూమిని వేలం వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి యత్నించడం సరికాదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ఆవేదన వ్యక్తంచేశారు. భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలిపి మాట్లాడారు. యూనివర్సిటీ విద్యార్థులు, యూనియన్ నాయకులు, జర్నలిస్టులపై పోలీసులు అకారణంగా దాడులు చేయడం సరికాదన్నారు. భూముల రక్షణకోసం సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాకు వెళ్తున్న వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో దయ్యాల నర్సింహ తదితరులు ఉన్నారు.

భువనగిరి గంజ్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల రాహుల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రిన్స్ చౌరస్తా వద్ద సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు నేహాల్, జిల్లా కమిటీ సభ్యులు భవాని శంకర్, అభినవ్ పాల్గొన్నారు.

మూసీ జలాల కోసం

- మళ్లించాలని ఉధృతమవుతున్న రైతు ఉద్యమాలు
- మూసీలో మైసమ్మ కత్వ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయాలి
- రూ.52కోట్ల అంచనాతో లిఫ్ట్‌కు రూపకల్పన
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసిన రైతులు
- లిఫ్ట్ ఏర్పాటుకు నిధుల మంజూరుకు రైతుల డిమాండ్



చిన మూసీ నది వద్ద పరవళ్లు తొక్కుతున్న పిలాయిపల్లి మూసీ జలాలు

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ ప్రాంతంలో నెలకొన్న తీవ్రమైన సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మూసీజలాలను మళ్లించాలని ఆందోల్‌మైసమ్మ జలసాధన సమితి ఆధ్వర్యంలో రైతు ఉద్యమాలు ఉధృతమవుతున్నాయి. మూడు నెలలుగాసాగుతున్న సాగునీటి ఉద్యమాలతో గ్రామాల్లోని రైతులు, ప్రజలు ఐక్య ఉద్యమాలబాట పడుతున్నారు. మండల పరిధిలోని తూప్రాన్‌పేట సమీపంలోని చిన్నమూసీలోగల మైసమ్మకత్వ వద్ద లిఫ్ట్‌ను ఏర్పాటుచేసి పిలాయిపల్లి కాల్వ ద్వారా ప్రవహించే మూసీ జలాలను దిగువ ప్రాంతానికి మళ్లించాలన్న డిమాండ్‌తో రైతు ఉద్యమాలు కొనసాగుతున్నాయి. మూడునెలల క్రితం ఆందోల్ మైసమ్మ దేవాలయంవద్ద నిర్వహించిన రైతుల సమావేశంలో సాగునీటి ఉద్యమానికి బీజంపడింది. లిఫ్ట్‌తో మూసీజలాలను మళ్లించే పథకానికి రూ.52కోట్ల వ్యయమవుతుందని ప్రముఖ రిటైర్డు ఇంజనీరు శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ఒక నివేదికను రూపొందించారు.

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి

గ్రామాల్లో నెలకొన్న సాగునీటి సమస్యను ఇటీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి రైతులుతీసుకువెళ్లారు. మూసీ జలాలను లిఫ్ట్ ద్వారా మళ్లించి సాగునీటి సమస్య ను పరిష్కరించాలని, అందుకు రూ.52కోట్లు ఖర్చవుతుందని రైతులు తెలిపారు.

గ్రామాల్లో తీవ్రంగా సాగునీటి సమస్య

మండలంలోని అనేక గ్రామాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా మారడంతో రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రధానంగా తూప్రాన్‌పేట, దండుమల్కాపురం, ఖైతాపురం, ఎల్లగిరి, కొయ్యల గూడెం, డి.నాగారం, ధర్మోజిగూడెం, లక్కారం, చౌటుప్పల్, తంగడపల్లి, చింతలగూడెం, దామెర, ఆరెగూడెం...

- మిగతా 8వ పేజీలో...

మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద మహనీయుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

భువనగిరి గంజ్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే మహనీయులు బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్‌ల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ నాయకులు కోరారు.

ఈ మేరకు భీమ్ యాత్ర పోస్టర్లను మంగళవారం ఆ కమిటీ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు భట్టు రామచంద్రయ్య మాట్లాడుతూ ఏప్రిల్‌లో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దొనకొండ రాములు, కొత్త బాలరాజు, కొల్లూరి రాజు, సురపంగ శివలింగం, కర్తాల శ్రీనివాస్, ఇటుకల దేవేందర్, నాగరం శంకర్, బర్రె నరేష్, అన్నంపట్ల కృష్ణ, బానోతు భాస్కర్ నాయక్, బాసాని మహేందర్, బొట్ల రమేష్, కానుకుంట్ల రమేష్ కోటి, రాజేష్ పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలపై బహిష్కరణ అస్త్రం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం యాజమాన్యాలు, వేతనాల కోసం ఫ్యాకల్టీ
- ఉమ్మడి జిల్లాలో 66 ప్రైవేటు కళాశాలలు, 1800 మంది లెక్చరర్లు
- ప్రాక్టికల్స్‌కు హాజరుకావలసిన విద్యార్థులు 25వేలు

7

లేఖ.. రాయలేక..

'తొలిసారి మిమ్మల్ని చూసిందీ మొదలు' అంటూ సాగే పాటను 1990 దశకంలోని ఎవరైనా ఇట్టే గుర్తు పట్టేస్తారు. 'శ్రీవారికి ప్రేమ లేఖ' సినిమాకు బలం ఈ పాటైతే, ఆ పాటకు మూలం ఓ లేఖ. సినిమా మొత్తం లేఖ చుట్టే తిరుగుతుంటుంది. చూడకుండానే లేఖ రాసిన వ్యక్తిని ప్రేమించేలా చేస్తుందీ ఆ లేఖ.

'అమ్మానాన్న నేను బాగానే ఉన్నా. ఏ దిగులు పెట్టుకోకండి. ఇప్పుడు సెలవులు లేవు. దసరా పండుగకు వస్తా' అని సైన్యంలో ఉన్న కుమారుడు రాసే లేఖ ఆ తల్లిదండ్రులకు భరోసాతో పాటు ధైర్యాన్నీ ఇస్తుంది. లేఖకు అంతటి బలం ఉంటుంది.

'నీకు పొరబోతుందీ అంటే నేను తలుచుకున్నానని అర్థం.. నిన్నెవరూ తలచేవారు లేరంటే నేను ఈ భూమి మీదనే లేనని అర్థం' అంటూ ప్రియురాలికి రాసిన ప్రియుడి లేఖ వారి హృదయాల ముడివేసే ఓ బంధం.

ఒకప్పుడు దూరంలో ఉండేవారి కులాసాలు ఇంటికి వచ్చే పోస్ట్‌కార్డ్(ఉత్తరం) ద్వారా నే తెలిసేవి. మనసులోని మాటలను, అన్ని విషయాలను సమగ్రంగా రాసి ఎదుటి వారి కి చేరువ చేసేలా గతంలో పోస్ట్‌కార్డులను విస్తృతంగా వాడేవారు. భావ వ్యక్తీకరణకు ఒక నాడు ఎంతో ఉపయుక్తంగా ఉన్న లేఖ లు నేడు కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)



- కనుమరుగవుతోన్న ఉత్తరం
- సోషల్‌మీడియా రాకతో ఉక్కిరిబిక్కిరి
- ఒకనాటి అనుబంధాల తీపిగుర్తు
- పెరిగిన సాంకేతికతతో కనుమరుగు
- రాసేవారూ కరువు

ఉత్తరాలు రాయడం అంటే ఒకనాడు ఎంతో అద్భుతంగా, ఆనందపారవశ్యంగా ప్రతి ఒక్కరిలో అనిపించేది. సాంకేతికత పెరిగిన నేటి తరంలో పెన్నుపట్టి తన స్నేహితులకు, ఆత్మీయులకు లేఖలు రాసేవారే కనుమరుగయ్యారు. చాటింగ్‌ల ఉధృతిలో ఉత్తరం బతుకు ఉక్కిరిబిక్కిరిగా మారిపోయింది. ఉత్తరం రాక కోసం పోస్ట్‌బాక్స్ ఖాళీగా ఎదురుచూస్తోంది. లేఖా రచ న ఒక సృజనాత్మకమైన ప్రక్రియ. ఇది సాహిత్య రంగంలో పేరు పొందింది. అంతటి ఘనచరిత్ర కలిగిన లేఖలను రాసే అలవాటూ ఈ తరం మరిచిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాసేవా రు లేక, మరోవైపు చదివే వారు కూడా కనిపించక అలనాటి మానవ సంబంధ, అనుబంధ సమాచార మాధ్యమమైన లేఖ(ఉత్తరం) సమా జం నుంచి దూరమయ్యే దుస్థితికి చేరుకుంది.

బట్వాడా నుంచి స్పీడ్‌పోస్ట్

పోస్టాఫీసుల ద్వారా రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్, ఆసరా పింఛన్ల పంపిణీ, మ నిఆర్డర్, సేవింగ్, ఇన్సూరెన్స్, పార్శిల్, కమ్యూనికేషన్, కరస్పాండెంట్ ఉత్తరాలు, బల్క్ లెటర్లు, శ్రీరాముడి తలంబ్రాలు అందిస్తున్నారు. దీనికి తోడు వార,మాస పత్రికలను ఇళ్లకు చేరవేస్తున్నారు.


యోగక్షేమాల ప్రత్యుత్తరాలు తగ్గిపోయాయి



పోస్టాఫీస్ ద్వారా ఎక్కువ శాతం యోగాక్షేమాలకు చెందిన ఉత్తరాలు తగ్గుముఖం పట్టాయి. ఫోన్ల ద్వారా ఛాటింగ్, మెసేజ్‌లతో సమాచారం వస్తుండటంతో ఉత్తరాలు తక్కువయ్యాయి. మిగతా సేవలు అన్నింటినీ అందిస్తూ సంపూర్ణంగా అందిస్తున్నాం. ఇతర సేవలపై పోస్టాఫీసులకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది.

- వెంకటస్వామిగౌడ్, పోస్ట్‌మన్, యాదగిరిగుట్ట

ఉత్తరాలు తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోయేవి



గత 50 ఏళ్ల కిందట ఉత్తరాలు తీపి జ్ఞాపకాలుగా ఉండేవి. కుటుంబ సభ్యులు, స్నేహితుల ద్వారా ఉత్తరాలు ఎప్పుడెప్పుడు వస్తాయని వాటికోసం ఎదురుచూస్తూ ఉండేవారు. ఉత్తరాలు చదివితే ఎంతో మధురంగా ఉండేవి. చుట్టుపక్కల ప్రజలకు ఉత్తరాలు వస్తే ఇంటికి వచ్చి చదివించుకొని ఆనందపడేవారు. యోగాక్షేమాల ఉత్తరాలు కనుమరుగు కావడం బాధాకరం. గతంలో ఉత్తరాలు వస్తే వాటిని పెట్టెల్లో, బీరువాల్లో భద్రంగా దాచిపెట్టుకున్న సంఘటనలూ ఉన్నాయి.

- మల్లేశం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

ప్ర.ప్ర./SPP/HYD - 2007 पोस्ट कार्ड POST CARD






క్లుప్తంగా.. మీమ్స్‌తో...

మారుతున్న కాలానుగుణంగా సమాచార మార్పిడిలోనూ చాలా మార్పులొచ్చాయి. ఉత్తరాల తర్వాత ఇంట్లో ల్యాండ్‌లైన్ ఫోన్లు వాడేవారు. ఆ తర్వాత సెల్‌ఫోన్లు, ఇప్పుడు స్మార్ట్ ఫోన్లతో సమాచార మార్పిడి అత్యంత వేగంగా రూపాంతరం చెందింది. ఒకనాడు రోజుల్లో చేరే సమాచారం ఇప్పుడు క్షణాల్లో అరచేతుల్లోకి వచ్చి చేరుతోంది. దీంతో ఉత్తరం రాసే వారు కరువయ్యారు. అప్పట్లో సుదీర్ఘంగా రాసే లేఖల నియమాలు కూడా ఇప్పటి మెసేజ్, ఛాటింగ్‌లలో కనీసం కనిపించడం లేదు. సోషల్‌మీడియాలో ఇప్పుడు మీమ్స్(బొమ్మల) రూపంలో భావాన్ని వ్యక్తీకరిస్తున్నారు. దీంతో సృజనాత్మకంగా రాసే అలవాటూ పోతోంది. అపురూపమైన లేఖలను ఆ రచనా సంప్రదాయ పద్ధతిని కాపాడి భావితరాలకు ఆ వారసత్వాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



(इस लाइन के नीचे न तो लिखें और न ही मुद्रित करें Do not write or print below this line)

ఉత్తరం కోసం రోజుల తరబడి ఎదురుచూసే వాళ్లం



ఉద్యోగరీత్యా మా పిల్లలు దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకోవాలంటే కేవలం ఉత్తరాలు ఒక్కటే ఆధారం. ప్రతి రోజూ మాకు ఉత్తరం వచ్చిందా అంటూ పోస్ట్‌మన్లను అడిగే వాళ్లం. ఉత్తరం వస్తే అందులో తమ పిల్లల యోగక్షేమాలతో పాటుగా పండుగలకు ఎప్పుడు వస్తారని సమాచారం ఉండటం ఎంతో ఆనందంగా ఉండేది. ఇప్పుడు ఉత్తరాల ప్రాముఖ్యం తగ్గింది.

- గంగసాని రామారావు, యాదగిరిగుట్ట

సేవలు అందించడం ఆనందంగా ఉంది



ప్రతిరోజూ ఏదో రకమైన పార్శిలు, ఆధార్ కార్డులు, వార, మాస పత్రికలు. ఇతర పుస్తకాలను ప్రజలకు అందించి సేవలు చేయడం ఆనందంగా ఉంది. ప్రజలను పలకరించడం వారికి సమాచారం అందిస్తుంటే తమలో ఉన్న బాధలు సైతం కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా సమాచార సేవకులుగా సేవలు అందించడం గొప్పతనంగా ఉంది.

- ప్రశాంత్, డాక్ సేవకుడు, యాదగిరిగుట్ట

సుకన్య సమృద్ధి యోజనతో ఎంతో ప్రయోజనం



పోస్టాఫీసుల్లో సేవలు మారిపోయాయి. ఆడపిల్ల కోసం ఏర్పాటుచేసిన సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతో ప్రయోజనం ఉంది. ఆడపిల్లలు ఉంటే వాటికి ఉన్నత చదువులు, పెళ్లిల నాటికి జమచేసిన డబ్బులతో రెట్టింపుగా రావడం కుటుంబానికి ఎంతో లాభసాటిగా ఉంటుంది.

- మీసాల స్వరూప, యాదగిరిగుట్ట

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి కాన్వాయ్‌లో వాహనం బోల్తా

గొర్రెను తప్పించే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు ఢీ ● నలుగురికి స్వల్ప గాయాలు



వద్దిరెడ్డిగూడెం వద్ద బోల్తా పడిన స్కార్పియో

గుర్రంపోడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెను తప్పించే క్రమంలో ఎమ్మెల్యే కాన్వాయ్‌లోని వాహనం బోల్తా పడి నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండలం వద్దిరెడ్డిగూడెం వద్ద ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి గుర్రంపోడు మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అనుముల మండలంలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవానికి బయలుదేరారు. ఎమ్మెల్యే కారు వెనుక ఉన్న వాహనంలో పీఏ అశోక్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది ఉన్నారు. ఈ క్రమంలో వద్దిరెడ్డిగూడెం సమీపంలో రోడ్డు వెంట గొర్రె అడ్డురావటంతో దానిని తప్పించే క్రమంలో డ్రైవర్ వాహనాన్ని పక్కకు నడిపారు. అదే సమయంలో గుంతలోకి వెళ్లి అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను బలంగా ఢీకొట్టి ఎగిరిపడింది. అక్కడే ఉన్న స్థానికులు అప్రమత్తమై అందులో ఉన్న నలుగురిని బయటకు తీశారు. స్వల్ప గాయాలు కావటంతో, ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకర్‌రెడ్డి

బీబీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 160 గ్రాముల గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామానికి చెందిన ముల్కలపల్లి రమేష్, హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన టేకుల మనీష్ వీరికి తోడుగా బాలుడితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. గంజాయిని విక్రయించి డబ్బులు సంపాదించాలని భావించారు. దీంతో హైదరాబాద్ దూల్‌పేటకు చెందిన సింగ్ వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి పరిసరా గ్రామాల్లో గంజాయికి అలవాటు పడిన యువకులకు ఎక్కువ డబ్బులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో మార్చి 31న దూల్‌పేటలో గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో బీబీనగర్ శివారులో టీఎస్30ఎల్5174 నెంబర్ బైకుపై త్రిబుల్ రైడింగ్ చేస్తూ వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానించిన పోలీసులు పట్టుకుని తనిఖీ చేసి, విచారించారు. వారి వద్ద 160 గ్రాముల గంజాయి, మూడు సెల్‌పోన్లు, బైకును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, తరుచూ ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్టును నమోదు చేస్తామన్నారు. ఎక్కువ రోజులు జైలులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

అర్వపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలోని కొమ్మాల గ్రామంలో జరిగింది. స్థానికులు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మహిళ సంఘం వీబీకే సిగ యాదమ్మ ఇంట్లో గ్యాస్‌సిలిండర్ పేలింది. ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం కాలిపోయింది. వంట సామగ్రి, విలువైన వస్తువులు కాలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనతో సుమారు రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపింది.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం..

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధమైంది. కాలనీలోని రాఘవేంద్ర అపార్ట్‌మెంట్ కింద గల దుకాణ సముదాయంలో నిర్వహించే శ్రీలక్ష్మీ జిరాక్స్, బోటిక్ షాపులో షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. దీంతో మంటలు వ్యాప్తి చెంది జిరాక్స్ మిషన్‌తో పాటు కుట్టు, ఎంబ్రాయిడరీ మిషన్లు, ప్రింటర్ దగ్గమయ్యాయి. ఈ ఘటనతో రూ.7 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని నిర్వాహకురాలు పొలిశెట్టి సక్కుబాయి తెలిపారు. కస్టమర్ల వస్త్రాలతో పాటు బోటిక్‌కు సంబంధించి విలువైన సామగ్రి దగ్ధమయ్యాయని ఆమె వాపోయారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఆలేరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు-పెంబర్తి రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. భువనగిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జీ కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు రైల్వేస్టేషన్ నుంచి పెంబర్తికి వెళ్లే దిగువ రైలుమార్గంలో 266/22-24 రాయి వద్ద దగ్గర గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి సుమారు 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై నీలం వైట్ కలర్ చెక్స్ టీషర్ట్, నీలం కలర్ ప్యాంట్ ఉందన్నారు. మృతదేహాన్ని భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరిచామన్నారు. వివరాలకు 9848222169 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



పాండు(ఫైల్)

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి సమీపంలోని దుప్పలపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తునికినూతలతండాకు చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన పాతలోతు పాండు(28) ఇటీవల బ్యాంక్ రుణంతో కారును తీసుకుని మిర్యాలగూడలోనే నివాసం ఉంటూ ఉపాధి పొందుతున్నాడు. అయితే మంగళవారం ముగ్గురు ప్యాసింజర్లను కిరాయికి కుదుర్చుకుని హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో సాయంత్రం నాలుగు గంటలకు దుప్పలపల్లి వద్దకు రాగానే కంటైనర్‌ను వెనక నుంచి కారు ఢీకొట్టడంతో పాండుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలైనట్లు సమాచారం. పాండు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం గురించి తెలియడంతో పాండు కుటుంబీకులు, బంధువులు, తండావాసులు హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలివెళ్లారు. ప్రమాదంలో పాండు మృతి చెందడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. పాండుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కేతేపల్లి సమీపంలో బాలుడు..



సాయిదేవాన్ష్(ఫైల్)

కేతేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బైక్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటనలో ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ శివతేజ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన అనుముల ప్రవీణ్ హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో తల్లిదండ్రులతో కలిసి ఉగాది పండగ జరుపుకోవడానికి వచ్చాడు. పండగ తర్వాత మంగళవారం ఇంట్లో ఎల్లమ్మ పండగ చేస్తుండడంతో అవసరమైన గ్యాస్‌సిలిండర్ కోసం కేతేపల్లిలోని ఏజెన్సీ కార్యాలయం వద్దకు కుమారుడు సాయిదేవాన్ష్(6)తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. కేతేపల్లికి చేరుతున్న క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు అతివేగంగా వెళుతున్న ప్రసన్న ట్రావెల్స్‌కు చెందిన బస్సు ప్రవీణ్ బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ప్రవీణ్, ఆయన ఆరేళ్ల కుమారుడు సాయిదేవాన్ష్‌లు ఎగిరి కింద పడిపోయారు. ప్రవీణ్ చేయి విరగ్గా, దేవాన్ష్ తలకు తీవ్రగాయాలై రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి వెళ్లాడు. సమాచారం అందుకున్న 108సర్వీసు సిబ్బంది క్షతగాత్రులను సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు దేవాన్ష్‌ను మెరుగైన చికిత్స కోసం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడకు చేరేలోపే సాయిదేవాన్ష్ ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. ఈ సంఘటనపై సాయిదేవాన్ష్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

పొట్టకూటి కోసం వెళ్తే మృత్యువు వెంటాడింది

మద్దిరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కూలికి వెళ్లిన వృద్ధురాలిని కారు రూపంలో మృత్యువు వెం టాడింది. మంగళవారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో జరిగింది. ఏఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌బాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన అలువాల స్వరాజ్యం(58) కూలి పని కోసం ఆటోలో మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామానికి వచ్చింది. కుంటపల్లి గ్రామ స్టేజీ వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్వరాజ్యంకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, చిన్నకుమార్తె రేణుక ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.



తుడిమిడి మానాయికుంట ఎక్స్ రోడ్డు వద్ద పొలంలోకి దూసుకెళ్లిన కారు

పొలంలోకి దూసుకెళ్లిన కారు

శాలిగౌరారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది.కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన తుడిమిడి-గురజాల గ్రామాల మధ్యలో మానాయికుంట మూలమలుపు వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామానికి చెందిన గాజుల లింగయ్య, ఆయన భార్య రామనర్సమ్మ, కోడలు ప్రేమనంద కలిసి బంధువుల దశదిన కర్మకు సోమవారం యాద్రాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలకేంద్రానికి వెళ్లారు. మంగళవారం స్వగ్రామానికి బంధువుల కారు మాట్లాడుకొని స్వగ్రామానికి బయలుదేరారు. మానాయికుంట-గురజాల బ్రిడ్జి దాటి చిత్తలూరు గురజాల రోడ్డులో మలుపులో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. కారు టైర్‌పంక్చర్ అయ్యింది. కారులో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ప్రాణాలతో బయట పడడంతో ఊపిరిపీల్చుకున్నారు. కారులో ఉన్నవారిని స్థానికులు వెళ్లి బయటకు తీశారు. కొద్ది సేపటికీ క్రేన్ సహాయంతో పొలంలోకి దూసుకెళ్లిన కారును బయటకుతీశారు. గత జనవరి 26న కూడా సింగారం గ్రామానికి చెందిన వారు రామగిరికి వస్తుండగా ఇదే ప్రాంతంలో కారు పల్టీ కొట్టింది. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

రోడ్డుపై సూచిక బోర్డులు లేకనే ప్రమాదాలు

మానాయికుంట నుంచి గురజాల మధ్యలో మూసీనదిపై ఏడాది కిందట బ్రిడ్జితో పాటు ఇరువైపులా ఇటూఅటూ కిలోమీటర్ వరకు డబుల్ రోడ్డు వేశారు. కానీ సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



అంజయ్య(ఫైల్)

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ఎలిమినేటి మాధవరెడ్డి(ఏఎమ్మార్పీ) ప్రధాన కాల్వలో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. నల్లగొండ జిల్లా గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం గుడిపల్లి మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన వట్టెపు అంజయ్య(35) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. వరుసకు బావ అయ్యే ఎల్లయ్యతో కలిసి సోమవారం సాయంత్రం ఊరు చివరన ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వద్ద స్నానం చేసి వద్దామని కలిసి వెళ్లారు. స్నానం చేస్తూ కాలు జారి కాల్వలో పడి గల్లంతయ్యాడు. కాపాడేందుకు ఎల్లయ్య ప్రయత్నించినా సాధ్యపడలేదు. వెంటనే కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారమిచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. నీటిపారుదల అధికారులతో మాట్లాడి ప్రదాన కాల్వ గేట్లను మూసివేశారు. గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం గల్లంతైన ప్రాంతం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. అంజయ్య సోదరి బోడ యాదమ్మ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలపరిధిలోని ఘనపూర్ గ్రామంలో ఈ విషాద సంఘటన జరిగింది. సిద్ధాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం సాకేల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య(40) అచ్చంపేట మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన బుర్యానాయక్ పొలంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయిన విద్యుత్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. లైన్ మార్చేందుకు యత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. యజమాని బుర్యానాయక్ మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా వెంకటయ్య మృతదేహం కనిపించింది. దీంతో ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటయ్య భార్య యాదమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేతనాల కోసం ఆరు నెలలుగా ఎదురుచూపులు

- నెరవేరని రెగ్యులరైజ్ హామీ
- అప్పులతో కుటుంబాలను వెల్లదీస్తున్న ఉద్యోగులు
- 19 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగానే విధులు




ఉపాధి కూలీలకు పని వివరాలు వెల్లడిస్తున్న ఉద్యోగి(ఫైల్‌ఫొటో)

మద్దిరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో పనిచేసే సిబ్బందికి వేతనాలు అందడం లేదు. ఒకటి, రెండు నెలలు కాదు, ఏకంగా ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఇటీవల ఉగాది పండుగకు పస్తులు ఉండాల్సి వచ్చిందని ఉపాధిహామీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోయారు. 19 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తాము రెగ్యులర్ చేస్తారనన్న ఆశతో ఉన్నట్లు కాంట్రాక్ట్ ఉద్యోగులు తెలిపారు. 2024 ఫిబ్రవరి 2న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కాంట్రాక్ట్ ఉద్యోగులకు పే స్కేలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా నేటికీ అమలు కాలేదని ఉద్యోగులు చెబుతున్నారు.

విధులు ఘనం.. వేతనాలు ఆలస్యం

ఉపాధిహామీ చట్టంలో గ్రామాల్లో కూలీలకు పనులు గుర్తించడం, బిల్లులు చెల్లించేలా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అదనపు ప్రాజెక్ట్ అధికారులు(ఏపీవో)లు 18 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 81మంది,కంప్యూటర్/ అకౌంట్‌కు సంబంధించిన వారు 40మంది, ఫీల్డ్‌అసిస్టెంట్లు 270మంది, అటెండర్లు 23మంది ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ఉపాధిహామీ కూలీలతో పనులను చేయించడంలో, కూలీలకు వేతనాలు అందజేయడంలో భాగస్వాములవుతున్నారు. ఉపాధిహామీ పనులను క్రమం తప్పకుండా చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత మేరకు నిధులను రప్పించడంలో కీలకపాత్ర పోషిస్తారు. ఉపాధి పనుల్లో హరితహారం, రైతువేదికలు, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, నీటి నిల్వ పనులు,పండ్లతోటల పెంపకం, మల్బరీ తోటల పర్యవేక్షణ, నర్సరీల నిర్వహణ లాంటి పనులను పర్యవేక్షిస్తుంటారు.ఇంత పనిచేస్తున్నా సకాలంలో వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల గురించి ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.


వేతనాలు త్వరగా ఇవ్వాలి



మంత్రి హామీ ఇచ్చినట్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు పే స్కేలు అమలు చేయాలి. 19ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా నేటికీ పర్మినెంట్ చేయలేదు. ఆరు నెలల వేతనాలు రాకపోవడంతో పండుగ పూట పస్తులు ఉండాల్సి వచ్చింది. వేతనాలు సకాలంలో చెల్లించాలి. వేతనాలు రాక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం.

బొబ్బిలి సుధీర్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు

చివరి తడి కోసం రైతుల పాట్లు



» బోర్లతో భగీరథ యత్నం
» పశువుల మేతగా మారుతున్న వరి

గుండాల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ పెరుగుతున్న భానుడి ప్రతాపంతో భూగర్భజలాలు అడుగంటి పోయి రైతులు పంటలు కాపాడుకోవడానికి చివరి తడి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో ఎన్నుడూ లేనంతగా మార్చిలోనే ఎండలు తీవ్రం కావడంతో పంట పొలాలు ఎక్కడికక్కడే ఎండిపోతున్నాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటి పోయి పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోతుండడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట రైతుల కళ్ల ముందే ఎండిపోయి పశువుల మేతగా మారుతోంది. దీంతో పంటకు తెచ్చిన అప్పు ఏ విధంగా తీర్చాలో అని రైతులు మనోవేదనకు గురవుతున్నారు. గుండాల మండలంలో ఈసారి వర్షాలు తక్కువగా కురవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. గుండాల మండలంలోని 20 గ్రామాల్లో మొత్తం 12వేల ఎకరాలు సాగు చేయగా సుమారు 1000 ఎకరాలకు పైగా ఎండిపోయినట్లు తెలుస్తోంది. దీంతో రైతులు గత సంవత్సరం కంటే తక్కువగా సాగు చేసినప్పటికీ సగం పంట కూడా పారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10రోజులు అయితే వరి పంట చేతికొచ్చే దశలో కళ్ల ముందే ఎండిపోతుండడంతో ఆ పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.



బోర్లతో భగీరథ యత్నం

గుండాల మండలంలో ఈ సంవత్సరం వర్షాలు సరిగా కురవకపోవడంతో భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో బోర్లలో, వ్యవసాయ బావుల్లో నీటి ఊట తగ్గిపోయింది. తద్వారా రైతులు పంటలు కాపాడుకోవడానికి భగీరథ ప్రయత్నాలు చేస్తూ కొత్తగా బోర్లు వేస్తున్నారు. అయినప్పటికీ బోర్లలో నీరు రాకపోవడంతో రైతులు తల పట్టుకుంటున్నారు. రైతులు పంటలు కాపాడుకోవడానికి అప్పులు తెచ్చి ఒక్కో బోరు 400ఫీట్ల పైన బోర్లు వేస్తుండడంతో 50వేల రూపాయల పైన ఖర్చు అవుతోంది. దీంతో పంటకు తెచ్చిన పెట్టుబడితో పాటు నూతనంగా బోర్లు వేసి బోర్లు పడకపోవడంతో ఈ అప్పు ఏ విధంగా తీర్చాలో తెలియని పరిస్థితిలో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గంపెడు ఆశలతో నాలుగు బస్తాల ధాన్యం పండితే ఎంతో కొంత లాభం చేకూరుతుందని ఆరుగాలం కష్టపడిన రైతుల రెక్కల కష్టం చివరికి నేల పాలవుతోంది. పొట్టకొచ్చిన పంట కళ్ల ఎదుటే ఎండుతుంటే రైతులు చేసేది లేక పశువులు, గొర్రెలను మేపుతున్నారు.

ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి



ఈ సంవత్సరం వర్షాలు సరిగా కురవకపోవడంతో గత సంవత్సరం కంటే వరి పంటలు తక్కువగా సాగు చేశాను. ఏడు ఎకరాల వరి పంట సాగు చేస్తే ఆరు ఎకరాల పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో పంటకు తెచ్చిన అప్పు ఏవిధంగా చెల్లించాలో తెలియడంలేదు. పంటను కాపాడుకోవడానికి నూతనంగా బోరు వేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది.ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- చెట్లపల్లి రాజయ్య , బూర్జుబావి, గుండాల మండలం

భూగర్భజలాలు అడుగంటడంతో ఇబ్బందులు



గతంలో ఎన్నడు లేనంతగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రెండు ఎకరాల వరి సాగు చేయగా ఎకరం వరి ఎండిపోయి పశువులకు మేతగా మారింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

- రైతు గురుమూర్తి , మర్రిపడగ, గుండాల మండలం

ట్యాంకర్లతో పారిస్తున్న రైతులు

రాజాపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రాజాపేట మండలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు, బావుల కింద సాగు చేసిన వరిపంట ఎండిపోతోంది. మండలంలోని పారుపల్లి గ్రామంలో ఓ రైతు ట్యాంకర్లతో నీటిని పోసి పైరును పారిస్తున్నాడు. గ్రామానికి చేందిన కాలె నర్సింహులు 5 ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఎకరానికి 25 వేల రూపాయలు వెచ్చించాడు. రెండు బోర్లు, ఒక బావి ఉండగా ఐదు ఎకరాలు సాగు చేశాడు. వర్షాలు సరిగా కురవక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లు, బావులు ఎండిపోయాయి. మూడు ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. రెండు ఎకరాలు ముందుగా సాగు చేయడంతో కంకి దశకు చేరుకుంది. ఆపైరు మరో 20 రోజులైతే పంట చేతికొస్తుంది. దీంతో రైతు ఆ పంట రక్షణకు పడరాని పాట్లు పడుతున్నాడు. సమీప రైతు దగ్గర నుంచి నెల రోజులకు 5 వేల రూపాయలకు నీటిని కోనుగోలు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పోస్తున్నాడు. రోజుకు 8 ట్యాంకర్ల నీటిని పోస్తూ పారిస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు మండలంలో ఎండిపోయిన పంటలను పరిశీలించి నష్ట పరిహారాన్ని చెల్లించాలని మండల రైతులు కోరుతున్నారు.



సాగర్ సమాచారం




పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	519.10
టీఎంసీలు	147.6397
ఎడమకాల్వకు నీటి విడుదల	6870
కుడికాల్వకు	4050
విద్యుత్ కేంద్రం ద్వారా	0
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	2926
అవుట్‌ఫ్లో	13,020 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు



పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.71 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	300 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	623.93 అడుగులు
టీఎంసీలు	0.75
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	367.51 క్యూసెక్కులు

డిగ్రీ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలపై బహిష్కరణ అస్త్రం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం యాజమాన్యాలు, వేతనాల కోసం ఫ్యాకల్టీ
- ఉమ్మడి జిల్లాలో 66ప్రైవేటు కళాశాలలు, 1800 మంది లెక్చరర్లు
- ప్రాక్టికల్స్‌కు హాజరు కావలసిన విద్యార్థులు 25వేలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షలపై మరోమారు బహిష్కరణ అస్త్రాన్ని విసిరాయి. గత అక్టోబరులో సమ్మె విరమణ ఒప్పందంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలుపుకోనందున మరోమారు సమ్మెకు సిద్ధమైనట్లు యాజమాన్యాలు ప్రకటించగా.. గత ఆరు నెలలుగా తమకు వేతనాలు అందనందున ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నట్టు లెక్చరర్స్ తెలిపారు. దీంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) పరిధిలో నేటి నుంచి రెండు గ్రూపులుగా జరగాల్సిన ప్రాక్టికల్స్, ఇంటర్నల్ పరీక్షలపై అయోమయం నెలకొన్నది. అయితే ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించడం లేదంటూ కళాశాల నుంచి వెళ్తున్న ఫోన్లతో విద్యార్థుల్లో అయోమయం నెలకొంది.

నేటి నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

నేటి నుంచి ఎంజీయూ పరిధిలో రెండు గ్రూపులుగా 2, 3, 4, 7, 8, 9వ సెమిస్టర్స్ ప్రాక్టికల్స్, ఇంటర్నల్ పరీక్షలు 2, 3, 4, 7, 8, 9వ తేదీల్లో జరగాల్సి ఉంది. సుమారు 66ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 25వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉంది. యాజమాన్యాల, లెక్చరెర్స్ బహిష్కరణ అస్త్రంతో ప్రైవేట్ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షలపై సందిగ్ధం నెలకొంది. పరీక్షల నిర్వహణపై 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ అయోమయం నెలకొంది. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం గత అక్టోబర్‌లో వారం రోజుల పాటు సమ్మె బాట పట్టిన యాజమాన్యాలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మల్లుతో పాటు ఉన్నత స్థాయి అధికారులు జరిపిన చర్చల్లో వారం రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీతో యాజమాన్యాలు సమ్మెను విరమించాయి. అనంతరం కొన్ని కళాశాలలకు మాత్రమే బకాయిలు చెల్లించగా ఇటీవల జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముందు ఉత్తర తెలంగాణలోని నాలుగు ఉమ్మడి జిల్లాల యాజమాన్యాలకు బకాయిలను విడుదల చేసిన ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాను మాత్రం విస్మరించిందని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. అదే సమయంలో ఉమ్మడి జిల్లాలోని 66 ప్రైవేట్ కళాశాలల్లో పని చేస్తున్న సుమారు 1800 మంది ఫ్యాకల్టీకి యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులతో వేతనాలు చెల్లించడం లేదు. దీంతో విసిగిపోయిన యాజమాన్యాలు, లెక్చరర్స్ ఎవరికి వారు ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నట్టు 15 రోజుల క్రితమే యూనివర్సిటీ అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు.

యాజమాన్యాలకు రూ.100 కోట్లు, లెక్చరర్లకు రూ.25 కోట్లు

ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.100కోట్లు రావల్సి ఉందని ఎంజీయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ యాజమాన్యాలు అంటున్నాయి. దీంతో కళాశాలల నిర్వాహణ పేరిట అప్పులపాలయ్యాయని యాజమాన్యాలు తెలిపాయి. అలాగే సుమారు 1800 మంది లెక్చరర్లకు గత ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వేతన బకాయిలు సుమారు రూ.25 కోట్లు పైబడి పేరుకపోయాయని. దీంతో కుటుంబాలను పోషించడం కష్టంగా ఉందని, లెక్చరర్లు వాపోతున్నారు.

ఇచ్చిన మాట నిలుపుకోవాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోవాలి. భారీగా బకాయిలు పేరుకుపోవడంతో యాజమాన్యాలు అప్పుల పాలయ్యాయి. కనీసం సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని, భవనాల అద్దె చెల్లించలేని దుస్థితి. ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంటే కళాశాలలను శాశ్వతంగా మూసివేస్తాం.

● డి.ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఎంజీయూ ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్

వేతనాలు లేవు



కేవలం ఉపాధ్యాయ వృత్తిని మాత్రమే నమ్ముకున్న ప్రైవేట్ లెక్చరర్లకు యాజమాన్యాలు గత ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు.ప్రైవేట్ లెక్చరర్లలో అధిక మంది పేదలు, మధ్య తరగతి వారే. విధిలేని పరిస్థితుల్లోనే ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నాం. స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేస్తే మాకు వేతనాలు వస్తాయి.

● కె.కృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం

'దాసి' చిత్రం హిట్‌కు ప్రధాన కారకుడు సుదర్శన్

- ప్రముఖ సినీ విమర్శకుడు ప్రసేన్ బెల్లంకొండ
- సాగర్‌లో 'దాసి' సుదర్శన్ చిత్రకళా నిలయం ప్రారంభం



స్మారక చిత్రకళా నిలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖ కవులు, కళాకారులు, కార్టూనిస్టులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 'దాసి' చిత్రం పెద్ద హిట్ కావడానికి ప్రధాన కారకుడు 'దాసి' సుదర్శన్ అని ప్రముఖ సినీ విమర్శకులు ప్రసేన్ బెల్లంకొండ అన్నారు. మంగళవారం దాసి సుదర్శన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో గల సుదర్శన్ నివాసాన్ని ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, కవులు, కళాకారులు చిత్రకళా నిలయంగా మార్చారు. హైదరాబాద్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి చిత్రకళా నిలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసేన్ బెల్లంకొండ మాట్లాడుతూ దాసి చిత్రానికి సుదర్శన్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారన్నారు. ఆ చిత్రంలో హీరోయిన్ అర్చనను సుదర్శన్ తన కాస్ట్యూమ్స్‌తో అత్యంత సుందరంగా చూపించగలిగారన్నారు. ఆ చిత్రం దేశంలోనే పెద్ద హిట్ కావడంతో సుదర్శన్‌కు జాతీయ అవార్డు దక్కిందని తెలిపారు. నాటి నుంచి పిట్లంపల్లి సుదర్శన్ పేరు దాసి సుదర్శన్‌గా మారిందన్నారు.

తొలి జాతీయ అవార్డు అందుకున్న వ్యక్తిగా..

కాస్ట్యూమ్ విభాగంలో దక్షిణ భారతదేశంలో తొలి జాతీయ అవార్డు అందుకున్న వ్యక్తిగా సుదర్శన్ చరిత్రకెక్కారని ప్రసేన్ బెల్లంకొండ అన్నారు. సినీరంగంలో జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు వ్యక్తి కూడా సుదర్శన్ కావడం విశేషం అన్నారు. అంతేకాకుండా 'మాఊరు' అనే లఘు చిత్రానికి 1984 సంవత్సరంలో నంది అవార్డు కూడా వచ్చిందని, సుదర్శన్ ఆ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్‌గా ఉండటమే కారణమన్నారు. 2000 సంవత్సరంలో నంది అవార్డు కమిటీ సభ్యుడిగా వ్యవహరించారని, 2002లో రామానాయుడు నిర్మించిన 'హరివిల్లు' చిత్రానికి సుదర్శన్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారన్నారు. ఆ చిత్రానికి బంగ్లాదేశ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ బహుమతి గెలుచుకున్నట్లు చెప్పారు. సాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేసిన ఆయన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సైతం పొందారని గుర్తు చేశారు. కవి, రచయిత వేణు సంకోజు మాట్లాడుతూ ప్రముఖ చిత్రకారుడు, రచయిత, బహుభాష ప్రజ్ఞశాలి, ఉత్తమ ఉపాధ్యాయుడు అయిన సుదర్శన్ సినీ రంగంలో జాతీయ అవార్డును అందుకున్న తర్వాత దాసి సుదర్శన్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. సాగర్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన నాగార్జునకొండ, బుద్ధవనంతో పాటు దాసి సుదర్శన్ చిత్ర కళా నిలయాన్ని కూడా సాగర్‌కు వచ్చే పర్యాటకులు సందర్శించేలా చూడాలని ప్రముఖ కవులు, వక్తలు కోరారు. ప్రతి ఏటా కళాకారులు, చిత్రకారులు సుదర్శన్ స్మారక అవార్డులు కూడా అందజేయడానికి కృషిచేస్తామని ఆయన స్నేహితులు తెలిపారు. అంతే కాకుండా ఏటా రెండుసార్లు సుదర్శన్ స్మారక క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు ఆయన జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ సతీమణి స్వతంత్ర, కుమారుడు చక్రవర్తి, మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, ప్రభాకర్, కిరణ్మయి, మోహన్‌రాజు, ప్రసాద్, మున్నా, రచయిత వేణు, జర్నలిస్టు కృష్ణమూర్తి, కార్టూనిస్టులు శంకర్, విజయ్, కూరెళ్ల వెంకట్ ఆనంద్, చిత్రకారుడు నరసింహ, సాహితీవేత్తలు సరికొండ నరసింహరాజు, రామ్మోహన్ రాజు, శ్యాంసుందర్, హరికృష్ణ, శ్రీనివాస్, లక్ష్మణ్‌రెడ్డి 200 మంది కవులు, కళాకారులు పాల్గొన్నారు.

యువతను మోసగిస్తున్న ప్రభుత్వాలు: ఏఐవైఎఫ్

వలిగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసగిస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏఐవైఎఫ్ మండల నాలుగో మహాసభ జరిగింది. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించి ధర్మేంద్ర మాట్లాడుతూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా, మత ఛాందస విధానాలు నూరి పోయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్వార్థ రాజకీయాలు తెర లేపుతున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలది కాదా? అని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఏఐవైఎఫ్ విద్య, వైద్యం ఉపాధి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సూచించారు. వలిగొండలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, మూసీ నదిని ప్రక్షాళన చేయాలని అన్నారు. మారోజు నర్సింహాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి పోలెపాక యాదయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎలగందుల అంజయ్య నాయకులు వీరస్వామి, సాయికుమార్, దేవేందర్, రాజు, వినయ్, నాగరాజు, కృష్ణకుమార్, ప్రదీప్, సుదర్శన్, మత్స్యగిరి, యాదగిరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు

నల్లగొండ స్పోర్ట్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) యువకులు, విద్యార్థుల్లో క్రికెట్ క్రీడా నైపుణ్యాన్ని పెంచేందకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీ నుంచి ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీనొద్దిన్ తెలిపారు. మంగళవారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 8 నుంచి 19 సంవత్సరాల బాలబాలికలకు శిక్షణ ఇస్తున్నామని, సీనియర్ కోచ్‌లతో ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి ఏడు గంటల వరకు శిక్షణ జరుగుతుందని కావున ఆసక్తి గల బాలబాలికలు ఈ నెల రెండో తేదీ నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని, వివరాల కోసం 6302538123 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని కేంద్రీయ విద్యాయంలో ఈ నెల రెండో తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆఫ్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తు ఫారాలను ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యాలయంలో పొందవచ్చని దరఖాస్తులు చేయడానికి ఈనెల 11వ తేదీ చివరి తేదీ అని తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



ఆంజనేయస్వామికి హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,89,590ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

కొండపైన మాలధారణ

స్వామివారి ఆలయంలో ముఖమండపంలోని ఉత్సవమూర్తుల వద్ద మంగళవారం భక్తులు మాలధారణ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 25మంది భక్తులు పసుపు వర్ణం దుస్తులతో దీక్ష స్వీకరించారు. వీరికి కొండకింద గోదాం వద్ద గల రెండు గదులు కేటాయించారు. దీక్ష చేపట్టిన భక్తులకు అన్నదాన సత్రంలోనే ప్రత్యేకంగా వంటలు చేసేందుకు ఈవో ఏ. భాస్కర్‌రావు ఆదేశించారు. వచ్చే నెల 11న స్వామివారి జయంతి ఉత్సవం, స్వాతి నక్షత్రం రోజున కలిసి రానుండటంతో అదే రోజు దీక్ష విరమిస్తారు. కాగా మంత్రి పర్యటన నేపథ్యంలో వాహన పూజలు రద్దుచేయడంపై కొంతమంది భక్తులు అసహనం వ్యక్తం చేశారు.



కొండపైన మాలధారణ చేసిన భక్తులు

భక్తి భావంతోనే జీవితాలకు సార్థకత



భక్తులకు ఉపదేశం చేస్తున్న అభినవ శంకరానంద స్వామిజీ

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : భక్తి భావంతోనే ప్రజలు తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణానికి చెందిన వేదాంత గీతాల ఫౌండేషన్ అధ్యక్షుడు అభినవ శంకరానందగిరి స్వామిజీ అన్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో స్థానిక ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో యతి కుటీరం నందు ఈనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆత్మజ్ఞాన సదస్సును అధ్యక్షుడు భారత పురుషోత్తం అధ్యక్షత వహించగా స్వామిజీ ప్రారంభించారు. జ్ఞానం గొప్పతనాన్ని వేద శాస్త్రాల సారాన్ని, తత్వ జ్ఞానాన్ని ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం ఆలయం ఆవరణలో ఉపదేశిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఆధ్యాత్మిక జ్ఞానం, భక్తి, ధర్మనిష్ఠ ప్రజలు తెలుసుకుని వాటిని పాటించాలని, తద్వారా వారి జీవితాలను సార్థకత చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షులు భారత పురుషోత్తం, గౌరవాధ్యక్షుడు కటకం తుకారాం, ఉపాధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి నోముల అశోక్, సహాయ కార్యదర్శి సుంకి వెంకటేష్, కోశాదికారి పుప్పాల నాగేశ్వర్, సిరిమల్లె వెంకటేష్, దేవాలయం అధ్యక్షులు డాక్టర్ సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షులు భారత ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, సహాయ కార్యదర్శి గుర్రం కృష్ణ, కోశాధికారి ఇంజమూరి యాదగిరి, ధర్మకర్తలు మెరుగు యతినందం, ఆటిపాముల నాగేష్, వనం కృష్ణ, చిక్క వెంకటేశం, నక్క రామచంద్రం పాల్గొన్నారు.



ఆత్మజ్ఞాన సదస్సుకు హాజరైన భక్తులు

పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా విష్ణు

ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 1: (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆత్మకూరు(ఎం) పట్టణ పద్మశాలి సంఘం సభ్యుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తొర్ర విష్ణు, ఉపాధ్యక్షులుగా సుల్తాన్ పురుషోత్తం, గర్దాస్ లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శిగా ఎలగందుల మల్లయ్య, కోశాధికారిగా సాయిని శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామన్నపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిములను పూర్తి చేసి, కార్మికుల సమస్య పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిగె సోములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కేజే భవన్‌లో నిర్వహించిన పట్టణ భవన నిర్మాణ కార్మికు సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు ద్వారా లేబర్ కార్యాలయాల్లో అందించే క్లయిములను పెండింగ్‌లో ఉండటంతో రోజుల తరబడి తిరగాల్సి వస్తోందన్నారు.

మూసీ జలాల కోసం



చిన మూసీ లోని మైసమ్మ కత్వ వద్ద క్రాస్ అవుతున్న పిలాయిపల్లి కాలువ జలాలు

(5వపేజీ తరువాయి)

తదితర గ్రామాల్లో సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో వ్యవసాయ రంగం దెబ్బతిన్నది. సాగు భూములన్నీ బీడు భూములుగా మారిపోతుండడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచారంగా మారింది. రైతులు తమ భూముల సేద్యాన్ని వదిలిపెట్టి ఉపాధి కోసం ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు. మూడేళ్ల నుంచి వర్షాలు కురియక తీవ్రమైన అనావృష్టి పరిస్థితులు నెలకొనడంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడంతో 1000 అడుగులలోతు ఉన్న బోరు బావులు సైతం ఒట్టిపోతున్నాయి. అక్కడక్కడ రైతులు సాగు చేసిన వరి పంట పొలాలు సైతం ఎండిపోయి పశువులకు గ్రాసంగా మారిపోయింది. సాగుకోసం రైతులు పెట్టిన పెట్టుబడులు మట్టిలో కలిసిపోవడంతో కన్నీళ్లు పెడుతున్నారు. మూగజీవాలకు సైతం తాగు నీరు దొరకని విపత్కర పరిస్థితి ఏర్పడింది. అటవీ ప్రాంతాల్లో పక్షులు మృత్యువాత పడుతున్నాయి. ఇదిలా ఉంటే లక్కారం చెరువు లోకి వరద కాలువ కోసం 1992 లోనే రైతు ఉద్యమాలు ఉధృతంగా సాగాయి.

మూడొంతుల గ్రామాలకు కరువైన సాగునీరు

చౌటుప్పల్ మండలంలోని మూడొంతుల గ్రామాలకు సాగు నీటి వనరులు లేక వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుంది. గ్రామాల్లో వరి పొలాలు కనిపించడంలేదు. వర్షాదార పంటలపై ఆధారపడిన రైతులకు ఆశించిన ప్రయోజనం లేకుండాపోయింది. రెండు, మూడు గ్రామాల్లో ఆకు కూరలను సాగు చేసుకుంటూ రైతులు జీవనం సాగిస్తున్నారు. మూడేళ్లుగా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొనడంతో సాగునీటి కోసం రైతులు ఉద్యమ బాటపట్టారు. కాగా, పిలాయిపల్లి కాల్వను నిర్మించిన ఆరేడు గ్రామాల్లో సాగునీటి సమస్య కనిపించడం లేదు.

ఆందోళ్ మైసమ్మ జలసాధన సమితి ఆవిర్భావం

ఈ ప్రాంతంలో ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న ఆందోళ్ మైసమ్మ దేవాలయం పేరుతో జలసాధన సమితిని 2025 జనవరి 19న రైతులు ఉద్యమ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే ఉద్యమాలను నిర్వహిస్తున్నారు. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల్లోని అనేక గ్రామాల్లో సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించి ఉద్యమాలకు సన్నద్ధం చేస్తున్నారు.

మైసమ్మ కత్వ లిఫ్ట్‌కు రూ.52కోట్లు

తూప్రాన్‌పేట సమీపంలోని పిలాయిపల్లి కాల్వ వద్ద (చిన మూసీనదిలో) మైసమ్మ కత్వ వద్ద లిఫ్ట్ ను ఏర్పాటు చేసి మూసీ జలాలను మళ్లించే ప్రాజెక్ట్‌కు రూ.52కోట్ల వ్యయమవుతుందని రిటైర్డ్ ఇంజనీరు శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఒక నివేదికను రూపొందించారు. దీని ప్రకారం మైసమ్మ కత్వకు ఎగువ భాగంలో చిన మూసీనదిలో రూ.2కోట్లతో పంప్‌హౌస్ నిర్మించడంతోపాటు రూ.75లక్షలతో విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర వాటిని ఏర్పాటుచేయాలి. రూ.4కోట్లతో 3.60మెగావాట్ల ఎస్‌వీటీ రెండు మోటార్లను బిగించి 80మీటర్ల ఎత్తుకు గుట్టపైకి జలాలను లిఫ్టింగ్ చేయాలి. అక్కడినుంచి రూ.7.80కోట్ల అంచనాతో 2కిలోమీటర్ల పొడవున 1100 ఎంఎం (డయా.. మీటరు) వ్యాసార్థంగల పైపును ఏర్పాటుచేసి చివరన సంప్‌ను నిర్మించాలి. సంప్ నుంచి రూ.26.71 కోట్ల అంచనాతో 1500 ఎంఎం వ్యాసార్థంగల పైప్‌ను 5 కిలోమీటర్ల పొడవుతో శేషరాజ్ కుంట దిగువ ప్రాంతంవరకు ఏర్పాటు చేయాలి. జీఎస్టీ, టెండర్ ప్రకటన, డెలివరీ తదితర ఇతర చార్జీలకు రూ.10.74కోట్లను కేటాయించాల్సి ఉంటుంది. కాగా, మైసమ్మ కత్వకు దక్షిణభాగంలో 600 మీటర్ల దూరంలో బ్యాక్ వాటర్‌లో ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని ప్లాన్‌లో నిర్దేశించారు. ఈ లిఫ్ట్‌నుంచి దిగువ ప్రాంతానికి అవసరమైన జలాలను పంపించేందుకు ఎగువ భాగంలోని పిలాయిపల్లి కాల్వను వెడల్పు చేయడంతో పాటు మైసమ్మ కత్వ ఎత్తును పెంచాల్సి ఉంటుంది. మండల పరిధిలోని దండు మల్కాపురంలోని శేషరాజ్ కుంటలోకి చేరుకున్న మూసీ జలాలు కీలకం కానున్నాయి.

చౌటుప్పల్ ప్రాంతం వైపు

మైసమ్మ కత్వనుంచి లిఫ్ట్ ద్వారా వచ్చిన మూసీ జలాలు శేషరాజ్ కుంటలోకి చేరుకుంటాయి. అందులో నుంచి దండుమల్కాపురం పెద్ద చెరువు, ఖైతాపురం, లక్కారం, చౌటుప్పల్, తాళ్లసింగారం, పంతంగి, చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి, ఏపూర్, పేరపల్లి, మునుగోడు మండలం కిష్టాపురం చెరువుల్లోకి వెళ్తాయి. ఇవన్నీ కూడా గొలుసు కట్టు చెరువులు కావడంతో ఒకదాని తర్వాత ఒకటి నిండి అలుగుపోస్తాయి.

మూసీ జలాలను వ్యతిరేకిస్తున్న సంస్థాన్ రైతులు

మూసీజలాలను సంస్థాన్‌నారాయణపురం మండలానికి చెందిన రైతులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కాలుష్య కారక మూసీజలాలతో తమసాగు భూములు దెబ్బతింటాయని, ప్రాణకోటికి నష్టం జరుగుతుందని వారు వివరిస్తున్నారు. కృష్ణా జలాలతోనే తమ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేస్తున్నారు.

మండలానికి కృష్ణా, గోదావరి జలాలు

చౌటుప్పల్ మండలానికి కృష్ణా, గోదావరి జలాలను మళ్లించేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నారు. కాలుష్యకారక మూసీ జలాలతో భూసారం దెబ్బతింటుందని, జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉందని ఇటీవల తనను కలిసిన చౌటుప్పల్ ప్రాంత రైతులకు ఎమ్మెల్యే వివరించారు. మండలంనుంచి వెళుతున్న 65వ నెంబర్ జాతీయ రహదారికి ఉత్తరం వైపు గోదావరి జలాలు, దక్షిణం వైపు కృష్ణాజలాలతో చెరువులు, కుంటలను నింపి సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే ఉన్నట్టు సమాచారం.

ఉద్యమాలు కొనసాగిస్తాం



చిన మూసీనదిలోని మైసమ్మ కత్వ వద్ద లిఫ్ట్‌ను ఏర్పాటు చేసి మూసీ జలాలను మళ్లించే వరకు రైతు ఉద్యమాలను కొనసాగిస్తాం. మూసీ జలాలతోనే గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపి సాగునీటి వనరులను పెంపొందించాలి. గ్రామాల్లో నెలకొన్న సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఇదొక్కటే మార్గం. సాగునీటి వనరులు లేక వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాలను సాగిస్తాం.

-ముత్యాల భూపాల్ రెడ్డి, కన్వీనర్, జలసాధన సమితి, చౌటుప్పల్

నిధులు మంజూరు చేయాలి



మైసమ్మ కత్వ వద్ద లిఫ్ట్‌ను ఏర్పాటుచేసి మూసీ జలాలను మళ్లించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఈ పథకంతో మూడు మండలాల్లోని సుమారు 25 నుంచి 30 చెరువులు, కుంటలలోకి మూసీజలాలు వెళ్లే అవకాశం ఉంది. వందల ఎకరాలు సాగులోకి రానుంది. ఈ పథకానికి రూ.52కోట్లు వ్యయం జరుగుతుందని ఇంజనీరింగ్ అధికారుల అంచనా.

-కొంతం అనంతరెడ్డి, ఆర్గనైజర్, జలసాధన సమితి, చౌటుప్పల్

భువనగిరిలో 62.05 శాతం ఆస్తి పన్ను వసూలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భువనగిరి మునిసిపాలిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 62.05 శాతం ఆస్తి పన్ను వసూలైంది. మార్చి 31తో ముగిసిన గడువు నాటికి రూ.9.80 కోట్ల ఆస్తి పన్ను డిమాండ్‌కు గాను రూ.6.08 కోట్లు (6.08శాతం) మాత్రమే వసూలైంది. 90శాతం జరిమానా మాఫీని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ప్రజలు ఆస్తి పన్ను చెల్లింపులో ఆసక్తి చూపలేదు.

మాజీ కౌన్సిలర్ ఫతే మహమ్మద్ మృతి



ఫతే మహమ్మద్(ఫైల్)

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి మునిసిపల్ మాజీ కౌన్సిలర్ ఎండి ఫతే మహమ్మద్ (80) మంగళవారం మృతి చెందారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడైన అతను చోటే బాయ్‌గా అందరికీ సుపరిచితుడు. స్థానిక ఖాజీమహల్లాలోని స్వగృహం నుంచి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతని మృతికి పలువురు సంతాపం తెలిపారు.

కొరవడిన తులసీ కాటేజీ భద్రత

(5వపేజీ తరువాయి)

పడుతోంది. దేవస్థానికి సంబంధించి భక్తులకు కావాల్సిన అద్దె గదులు తులసీ కాటేజీలో మాత్రమే లభిస్తాయి. యాదగిరిగుట్ట పాత బస్టాండ్‌లో దిగిన భక్తులు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇక్కడకు వెళ్లాలంటే భక్తులు ప్రైవేట్ వాహనాలకు ఆశ్రయించక తప్పడం లేదు. వ్యక్తిగత వాహనాల్లో ఇక్కడకు చేరుకునేందుకు కనీసం తులసీ కాటేజీని సూచించే సైన్ బోర్డులు ఎక్కడ ఏర్పాటు చేయలేదు. భద్రత సిబ్బంది కనిపించకపోవడంతోపాటు కనీసం నిఘా నేత్రాలను కూడా (సీసీ కెమారాలు) ఇక్కడి దరిదాపుల్లో బిగించలేదు. కాగా, కాటేజీలో నృరసింహ సదనంలో 76గదులు, లక్ష్మీ సదనం 94గదులు, ఆండాల్ సదనం 242 గదులతోపాటు రూ.1,500 నుంచి రూ.3వేల వరకు అద్దె ప్రాతిపదికన సుమారు 62 కాటేజీలు కూడా ఉన్నాయి. గత నాలుగేళ్లుగా మొత్తం 412 అద్దె గదులు, 62 అతిథి గృహాల ద్వారా రూ. 9,5278,363 ఆదాయం సమకూరింది. ఇన్నేళ్లుగా ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోన్న అద్దె గదులపై ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉంది. ఎంతో మంది అధికారులు మారినప్పటికీ ఎవరు పట్టించుకోక నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఆలస్యంగా విధులకు రావడం ముందుగానే ఇంటి బాట పట్టడం నిత్యకృత్యంగా మారింది. పట్టించుకునే నాథుడు లేక విధుల్లో పూర్తి నిర్లక్ష్యం వహిస్తూ.. అద్దె గదులపై అధికారుల చిత్తశుద్ధి లోపించింది.

ప్రహరీ లేదు

తులసీ కాటేజీ ప్రాంతం ఒకే వలయంలోకి తెచ్చేందుకు వీటి చుట్టూ ఇప్పటివరకు ప్రహరి నిర్మించలేదు. ఈ గదులు యాదగిరిక్షేత్రం అభిముఖంగా ఉన్న పెద్దగుట్టకు మధ్యలో ఉన్నాయి. గదుల వెనకాల అటవి ప్రాంతంతో పెద్దగుట్ట ఉండగా ఇది దాటితే పూర్వగిరి ఆలయం దర్శించుకునే వీలుంటుంది. ఈ రెండు గుట్టల మధ్య ఉన్న గదుల్లో అద్దెకు దిగిన భక్తులకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో భక్తులు అభద్రత భావానికి లోనవుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే అధికారులు వీటి చుట్టూ ప్రహరీ నిర్మించక ప్రైవేట్ సత్రాలకు వెళ్లేందుకు దారి వదిలేసినట్లు తెలుస్తోంది. ఈ భవనాల చుట్టూ తాగి పడేసిన బీరు సీసాలు కన్పిస్తున్నాయి. ఇక్కడ సాధ్యమైనంత త్వరగా ప్రహరీ నిర్మించి భక్తులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

భద్రతా సిబ్బంది లేరు


24/7 నిత్యం భక్తులతో కిటకిటలాడే తులసీ కాటేజీలో భద్రతే లేదు. 43 మంది ఎస్పీఎఫ్, 23 మంది హోంగార్డులు, వీరికి తోడు అదనంగా మరో 34 మంది సురక్ష సిబ్బందితో కలిపి 100 మందితో కొండపైనే విధులు నిర్వహిస్తుండగా, వీరిలో ఒక్కరిని కూడా తులసీ కాటేజీలో ఇప్పటి వరకు నియమించకపోవడం అధికారుల చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. అధిక రద్దీతో ఇక్కడ కొన్నిసార్లు గొడవలు జరిగి సిబ్బందిపై దాడులు కూడా జరుగుతుంటాయి. వాటిని అదుపు చేసేందుకు ఆలయ వర్గాలు నేటికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. భద్రత సిబ్బందితోపాటు సీసీ కెమెరాలు అందుబాటులోకి తేవడమే కాక ప్రహరీ లేనందున నిత్యం ఇక్కడ తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇక్కడకు ఎవరెవరు వచ్చేది.., పోయేదీ ఎంతకి అంతు చిక్కని ప్రశ్నే. ఇన్ని గదుల్లో కనీసం గ్రీజర్లు అందుబాటులోకి తేకపోవడం అధికారుల పని తీరును ప్రశ్నిస్తోంది. భక్తుడి ఇబ్బందులు, వసతులపై ఫిర్యాదులు చేసేందుకు ఓ పుస్తకం లేకపోవడం ఒక ఎత్తయితే అధికారుల ఫోన్ నంబర్లు కూడా ప్రదర్శించకపోవడం మరో ఎత్తు.

డార్మెంటరీ హాల్ నిర్మించాలి

ఇప్పటి వరకు అద్దె గదుల కోసం వచ్చిన భక్తులు నిరీక్షించేందుకు సరిపడా కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతోపాటు విశ్రాంతి గది కూడా అందుబాటులో లేదు. ఆలయ పునర్నిర్మాణ సమయంలో ఇక్కడ గదులు దొరకని భక్తులకు బోట్ షీకారు కోసం కేటాయించిన స్థలంలో డార్మెంటరీ హాల్ నిర్మాణం చేస్తే ఎంతో మేలు జరుగుతోంది. బోట్ షీకారు కోసం కేటాయించిన స్థలం ఆ పక్కనే సత్యదేవుని వ్రతాలు జరిపిన స్థలంలో తాత్కాలిక, శాశ్వతంగా డార్మెంటరీ హాల్ నిర్మించొచ్చు. కొండపైన నిద్రించేందుకు అవకాశం లేనందున పూర్తి రక్షణ చర్యలతో విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి ఏర్పరచి భారీ షెడ్డును నిర్మించేందుకు అనువైన స్థలం ఉంది. ఈ సదుపాయాలు అందుబాటులోకి వస్తే కనీసం దేవస్థానం పరిధిలో నిద్రించామనే తృప్తి భక్తులకు మిగులుతోంది.

గదుల ఒక్కొక్క గదికి అద్దెలు అద్దె గదుల ద్వారా సమకూరిన ఆదాయం రూ. కోట్లల్లో				
నృరసింహ సదనం	76	రూ. 340	2021-22	రూ. 1,60,75,800
లక్ష్మీ సదనం వీటిలో	94 అద్దె గదులు	2022-23		రూ. 2,13,70,654
	12 గదులు	రూ. 1,008		
	82 గదులు	రూ. 560	2023-24	రూ. 2,74,52,489
ఆండాళ్ సదనం వీటిలో	242 అద్దె గదులు		2024-25	రూ. 3,03,79,420
	70 గదులు	రూ. 1,350		
	60 గదులు	రూ. 1,008		రూ. 9,52,78,363
	112గదులు	రూ. 700		

అదనంగా సిబ్బందిని నియమించాలి



తులసీ కాటేజీ వద్ద భద్రత చర్యలు చేపట్టాల్సి ఉంది. తులసీ కాటేజీ వద్ద అధిక రద్దీ ఉంటున్నందున భద్రత కల్పిస్తాం. ప్రస్తుతం కొండపైన 100 మంది భద్రతా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరితోనే కొండపైన భద్రత ఏర్పాట్లకు సరిపోతున్నారు. తులసీ కాటేజీలో భద్రత చర్యలు చేపట్టేందుకు కొత్తగా అదనపు సిబ్బంది నియమించాల్సి ఉంది.

-కే.శేషగిరిరావు, ఎస్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్, యాదగిరిగుట్ట దేవస్థానం

త్వరలో భద్రత సిబ్బందిని నియమిస్తాం



తులసీ కాటేజీలో భద్రతకోసం త్వరలో హోంగార్డు సిబ్బందిని నియమిస్తాం. అప్పటివరకు రాత్రి ఇద్దరు హోంగార్డులను కేటాయిస్తాం. భవనాల రక్షణకు చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేస్తాం. దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. అప్పటివరకు భక్తులకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందిని అప్రమత్తం చేశాం. త్రాగునీటి వసతి, గదులు, భవన పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు సిబ్బందిని ఎప్పటికప్పుడు పురామాయిస్తున్నాం. త్వరలో ఫిర్యాదుల పుస్తకం ఏర్పాటు చేస్తాం.

-ఈవో ఏపూరి భాస్కర్‌రావు (యాదగిరిగుట్ట, దేవస్థానం)

పేదల ఆకలి తీర్చేందుకే సన్న బియ్యం పంపిణీ



అడ్డగూడూరులో సన్నబియ్యం పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు/ అడ్డగూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆకలితో కడుపు మాడ్చుకుంటున్న పేదల ఆకలి తీర్చేందుకే ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో ఆయన సన్నబియ్యం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. గతంలో రేషన్ దుకాణాల ద్వార దొడ్డు బియ్యం ఇస్తే ప్రజలు ఆ బియ్యంతో వండిన అన్నం తినలేక రూ.ఐదారుకు కిలో చొప్పున విక్రయించేవారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పేద ప్రజలకు సన్న బియ్యం అందిస్తుందన్నారు. బునాదిగానికాల్వ పూర్తి చేయడానికి రూ.267 కోట్లు మంజూరైనందున త్వరలోనే పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేయిస్తానన్నారు. బునాదిగానికాల్వ పూర్తయితే మోత్కూరు, అడ్డగూడూరు మండలాల సాగు నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. తమ ప్రభుత్వం నియోజకవర్గంలో రైతులకు రూ.401 కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రోజారాణి, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, ఏపీఐడీపీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, ఆర్ఐలు సుమన్, శ్రీనివాస్, డీలర్లు గార్లపాటి లక్ష్మయ్య, సునితాశ్రీనివాస్ పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండల కేంద్రంలోని రేషన్‌షాపు 1లో సన్నబియ్యం పంపిణీని ఎమ్మెల్యే సామేలు ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, మార్కెట్ కమిటీ డైరక్టరు బాలెంల విద్యాసాగర్, సినియర్ నాయకులు ఇటీకాల చిరంజీవి, పాశం సత్యనారయణ, బాలెంల సైదులు, తహశీల్దారు శేషగిరిరావు, ఆర్ఐ రాజేష్ పాల్గొన్నారు.

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత కాలం అందిస్తూ వస్తున్న దొడ్డి బియ్యాన్ని ఎవ్వరు తినడం లేదని పైగా అవి పక్కదారి పడుతున్నాయని ప్రభుత్వం గ్రహించిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వనజ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ భగత్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రామాంజనేయులు గౌడ్, పింగల్ రెడ్డి, శ్యాంగౌడ్, సత్తిరెడ్డి, నరేందర్ రెడ్డి, పెంటయ్య గౌడ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : సన్నబియ్యం పేద ప్రజలకు వరం లాంటివని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 7వ వార్డులోని 40వ రేషన్ దుకాణంలో మంగళవారం సన్నబియ్యం పంపిణీ పథకాన్ని శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పబ్బు రాజు, సుర్వి నర్సింహ్మా, చెన్నగోని అంజయ్య, సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ బొబ్బిళ్ల మురళి, బొడిగే బాలకృష్ణ పాల్గొన్నారు.

నిధుల వరద

(5వపేజీ తరువాయి)

రూ.4 కోట్లు కేటాయించి పూర్తిచేశారు. అదేవిధంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. గతంలో భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని బొమ్మాయిపల్లి రోడ్డు నుంచి రాయిగిరి వరకు 100 అడుగులతో రోడ్డును అభివృద్ధి చేశారు. టీచర్స్ కాలనీ నుంచి నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ వరకు 2.12 కిలో మీటర్ల మేరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. రోడ్డు విస్తరణతో పాటు మొత్తం పలు పనులకు రూ.20కోట్ల మేరకు కేటాయించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ.15కోట్లు, హెచ్ఎండీఏ నిధులు రూ.5కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అర్బన్ ఫారెస్టు నిధులతో చెరువు సుందరీకరణ పనులు, అదేవిధంగా పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించారు. నిధులు లేకపోవడంతో మార్కెట్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పనులపై కూడా దృష్టి కేంద్రీకరించారు.

జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్ అందజేత

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణ శివారులోని ఏజీఐ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్ సమకూర్చింది. ఈ మేరకు అంబులెన్స్ తాళం చెవులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజారావుకు మంగళవారం అందజేశారు. పరిశ్రమ ఔన్నత్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీశైల చిన్నా నాయక్, పరిశ్రమ సీనియర్ ఉపాధ్యక్షుడు గోవింద్ జి రాయి, ఏవి పీఐ ఆర్ మయాంక్ పాఠక్, సీనియర్ జనరల్ మేనేజర్ శివరాం, శ్రీధర్, నరేష్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

రాజాపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుర్ల లింగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాజాపేట మండలం నెమిల గ్రామంలో ఎండిన పంట పొలాలను సీపీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఎండిపోయిన పంటలకు 20వేల రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు కార్యక్రమంలో నాయకులు రామ్‌రెడ్డి, నర్సయ్య, కిష్టయ్య, సిద్దులు, రాజిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీత వెంకటేష్‌కు సన్మానం

ఆలేరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణానికి చెందిన హరిహర పుత్రఅయ్యప్ప స్వామి ఆలయ ధర్మకర్త మొరిగాడి వెంకటేష్‌కు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ విశ్వవిద్యాలయం ఇటీవల డాక్టరేట్ అందించింది. ఈసందర్భంగా వెంకటేష్‌ను ఆలేరు పట్టణానికి చెందిన పలువురు రాజకీయ పక్షాల నాయకులు సన్మానించారు. నాయకులు సత్యరాజయ్య, రామకృష్ణ, పంతం కృష్ణ, దూపటి వెంకటేశ్, మహేశ్, జూకంటి ఉప్పలయ్య, సత్యనారాయణ, కృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

కార్మికులకు అనుకూల వేతన సవరణ చేయాలి

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకందుకూర్ ప్రీమియర్ ఎక్స్‌ప్లోజీవ్స్ కార్మికులకు 12వేతన సవరణ కార్మికులకు అనుకూలంగా చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూషి మహేష్‌మాదిగ ప్రీమియర్ కంపెనీ టీఆర్ఎస్‌కేవీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డిని కోరారు. మంగళవారం పట్టణంలో మహేందర్‌రెడ్డి నివాసంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కంపెనీలో జరిగిన గుర్తింపు యూనియన్ గెలుపు కోసం ఎంతో కష్టపడి కార్మికులకు ముందుండి గెలిపించినందులకు ఆయన కృతజ్ఞతలను తెలిపారు.

ఇసుక విక్రయదారుడిపై కేసు

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక డంప్ చేసి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏదుల గణేష్ 30మెట్రిక్ టన్నుల ఇసుకను అక్రమంగా డ్రమ్ముల్లో నిల్వ చేశాడు. మంగళవారం పోలీసులు తనిఖీ చేసి, ఇసుకను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● చౌటుప్పల్ మండలం పెద్దకొండూరులో బెల్ట్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మాద రమేష్‌పై నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. 8బీర్లు, 10 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని భూములను వేలం వేసి, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలనే ప్రభుత్వ ఆలోచన సరైంది కాదని సీపీఎం, బీజేపీ నాయకులు అన్నారు. 400 ఎకరాల అడవిని ధ్వంసం చేసి పర్యావరణాన్ని విధ్వంసం చేసే ప్రక్రియ మానుకోవాలని కోరారు. భూముల వేలాన్ని ఆపకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన తప్పదని హెచ్చరించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన ధర్నాకు సీపీఎం రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ రామన్నపేటలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంట య్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, కందుల హనుమంతు, ఆనంద్, నగేష్, విజయభాస్కర్ పాల్గొన్నారు. భువనగిరిలో సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ విలేకరులతో మాట్లా డారు. యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కావద్దని పోరాడుతున్న యూనివర్సిటీ విద్యార్థులు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. మోత్కూరు, వలిగొండ, ఆత్మకూరు (ఎం), మోటకొండూరు, తుర్కపల్లి, అడ్డగూడూరులో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌చేశారు. మోత్కూరులో బీఆర్ఎస్‌వీ నాయకులను కూడా అరెస్ట్‌చేశారు.



రామన్నపేటలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు పెంటయ్య, వెంకటేశం తదితరులు

బీజేపీ ఆధ్వర్యంలో...

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలంటూ బీజేవైఎం చేపట్టిన చలో యూనివర్సిటీకి వెళుతున్న జిల్లా బీజేవైఎం నాయకులను మంగళవారం భువనగిరి టౌన్ పోలీస్‌లు ముందస్తుగా అరెస్టు చేశారు. ఇళ్ల వద్దనే తెల్లవారుజామున అదుపులోకి తీసుకొని సాయంత్రం వ్యక్తిగత పూచీపై వదిలిపెట్టారు. పట్టణ ఇన్‌సెక్టర్ కే సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేవైఎం జిల్లా, పట్టణ అధ్యక్షులు పట్నం కపిల్, కానుకుంట్ల రమేష్, కొలిచెలిమే మల్లిఖార్జున్, కట్కుమోజు ఉషా కిరణ్ అరెస్టు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాగేసుకునే కుట్రకు ప్రభుత్వం తెరలేపిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం బీబీనగర్‌లో హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్న బీజేవైఎం , బీజేపీ శ్రేణులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. యాదగిరిగుట్టలో బీజేపీ నాయకులను అరెస్ట్‌చేశారు. వలిగొండలో బీజేపీ మండల అధ్యక్షుడు సుదర్శన్ విలేకరులతో మాట్లాడారు.



యాదగిరి గుట్టలో బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు